క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి గురువారం ఘన స్వాగతం లభించింది. విజయవాడ నుంచి విశాఖ వచ్చిన ఆయనకు పలువురు నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు పేడాడ రమణకుమారి, కార్పొరేటర్ ముమ్మన దేముడు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలో శ్రీషిర్డీసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సాయిబాబాకు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం నక్షత్ర హారతి పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల సాయి సంకీర్తనల నడుమ అత్యంత కోలాహలంగా సాగింది. భక్తులు ఆలపించిన సాయిబాబా సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికత సంతరించుకుంది. వేడుకలో భాగంగా రాత్రి బాబాకు పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్ల సత్యనారాయణరావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మృతుని కుటుంబానికి బీమా సొమ్మును అందిస్తున్న వార్డు అధ్యక్షుడు సత్యనారాయణ

మల్కాపురం: ఇటీవల మృతి చెందిన 59వ వార్డు న్యూ వాయుపుత్ర కాలనీకి చెందిన దత్తి వెంకటనాయుడు కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ.. మృతుడి కుటుంబానికి తక్షణ సాయంగా రూ. 10 వేలు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా మొత్తం బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది రాంబాబు, ఈశ్వరమ్మ, సత్యవతి, గురునాయుడు, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు ఉద్యోగుల తొలగింపు సరికాదు'

ఉక్కునగరం: ఉద్యోగులను తొలగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు తగవని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. వాటిని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గురువారం యూనియన్ నాయకులు సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్తీను కలిసి సమస్యలపై చర్చించారు. సుమారు 1500 మంది తొలగిస్తారని వస్తున్న వార్తలు ఉద్యోగులకు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో అన్ని విభాగాలు సతమతమవుతుంటే ఉన్న ఉద్యోగులను తొలగించడమేమిటని ప్రశ్నించారు. సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బి.ఎస్.రాజు, కొమ్ము ప్రసాదరావు, కె.అవతారం, వి.ఎం.నాయుడు, సుబ్బయ్య, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. కనుమరుగు..!



- పటిష్టంగా డ్రైనేజీలు
- మేజర్ డ్రైన్ల నిర్మాణంకు ప్రాధాన్యత
- మురుగు నిల్వ లేకుండా చర్యలు
- భవిష్యత్ అవసరాల మేరకు పనులు



మర్రిపాలెంలో డ్రైనేజీ కాలువలపై పటిష్టంగా నిర్మించిన బ్రిడ్జి గోడలు



మర్రిపాలెం గ్రీన్ బెల్ట్‌లో డ్రైన్ నిర్మాణం



మర్రిపాలెం వుడా లే అవుట్‌లో నిర్మించిన మేజర్ డ్రైన్

విశాఖ విద్య: విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నగర పాలక సంస్థ పాలక మండలి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఎకో వైజాగ్ పేరిట పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రీనరీ పెంపునకు ప్రాధాన్యత ఇస్తూనే, నగరంలోని కాలనీల్లో మురుగునీరు నిలిచిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. పరిసరాల పరిశుభ్రతతోనే క్లీన్ విశాఖకు గుర్తింపు తెచ్చేలా పనులు చేపడుతోంది. దీనిలో భాగంగా కాలనీల్లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని గెడ్డల ఆధునికీకరణతో పాటు, డ్రైనేజీలను పటిష్టం చేస్తున్నారు.

ఎస్ఏడీ కూడలికి ప్రాధాన్యత

నగరంలో ఎస్ఏడీ సెంటర్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఎయిర్‌పోర్టు ఎస్ఏడీ సెంటర్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. అంతే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పలు సంస్థలు ఇక్కడ ఉన్నాయి. అటు గాజువాక, ఇటు పెందుర్తి, మరో వైపు బస్టాండ్ ఏరియా వెళ్లే వారంతా ఎస్ఏడీ మార్గంలోనే ప్రయాణిస్తారు. అందువల్లనే ఎస్ఏడీ ఏరియాలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. వీటన్నింటికీ అనుసంధానంగా ఉన్న 52వ వార్డు పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతులు పెంపునకు నగర పాలక సంస్థ ద్వారా పెద్ద మొత్తంలో నిధులు కేటాయింపు చేస్తున్నారు.

రూ.2.33 కోట్లతో డ్రైనేజీల అభివృద్ధి

52వ వార్డులో రహదారులు అభివృద్ధితో పాటు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. గెడ్డల ఆధునికీకరణ, డ్రైనేజీ, కాలువల పరిశుభ్రత, వాటికి ఇరువైపులా పటిష్టమైన గోడలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే రూ.1.12 కోట్లు మేర పనులు పూర్తి కాగా, తాజాగా మరో రూ.1.21 కోట్లతో పనులు చేపట్టేందుకు జీవీఎంసీ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను ప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా జీవీఎంసీ 5వ జోన్ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

పూర్తయిన పనులు

పని	వ్యయం
మర్రిపాలెం వుడా లే అవుట్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్‌కు డ్రైన్స్ నిర్మాణం	రూ.34. లక్షలు
శివాజీ నగర్‌లో ఎస్‌డబ్ల్యూ డ్రైన్స్ నిర్మాణం	రూ.12 లక్షలు
మర్రిపాలెం గౌరీ నగర్ వద్ద సీసీ రోడ్ కమ్ డ్రైన్ నిర్మాణం	రూ.12.70 లక్షలు
మర్రిపాలెం శివ శివానీ స్కూల్ వద్ద కల్వర్టు డ్రైన్స్	రూ.12.85 లక్షలు
కరాస వద్ద సీసీ డ్రైన్స్, కల్వర్టు పనులు	రూ.12.60 లక్షలు
స్టెల్లా మేరీస్ స్కూల్ వద్ద డ్రైన్స్ నిర్మాణం	రూ.16 లక్షలు
శాంతినగర్‌లో ఇంటర్నల్ డ్రైన్స్ నిర్మాణం	రూ.12.56 లక్షలు

త్వరలో చేపట్టనున్న పనులు

పని	వ్యయం
కరాస గౌరీ నగర్‌లో ఇంటర్నల్ డ్రైన్స్	రూ.13 లక్షలు
కరాస హిందూ శ్మశాన వాటిక నందు మేజర్ వీఆర్‌సీసీ డ్రైన్స్	రూ.38 లక్షలు
మర్రిపాలెం నిమిషి అపార్ట్‌మెంట్ వద్ద మేజర్ వీఆర్‌సీసీ డ్రైన్స్	రూ.40 లక్షలు
మర్రిపాలెం శాంతినగర్ వుడా లే అవుట్‌లో సీసీ డ్రైన్స్ మరమ్మతులు	రూ.16.20 లక్షలు
మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో సీసీ డ్రైన్స్	రూ.14.60 లక్షలు



కరాసలో డ్రైనేజీ గోడల నిర్మాణం

భవిష్యత్ అవసరాల మేరకు పనులు



52వ వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక సౌకర్యాలు పెంపొందిస్తున్నాం. ప్రజల భవిష్యత్ అవసరాలను గుర్తించి, పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సహకారం ఎంతో ఉంది. జీవీఎంసీ అధికారులు, పాలక మండలి మద్దతుతో వార్డును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

సమస్యలన్నీ తీరుతున్నాయి..



మా కాలనీలో సమస్యలన్నీ తీరుతున్నాయి. వుడా లే అవుట్‌లో మేజర్ డ్రైనేజీలను పటిష్టం చేయాలని ఎన్నో ఏళ్లుగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నాం. కానీ గతంలో ఏ ఒక్కరూ కూడా దీనిపై దృష్టి పెట్టలేదు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చొరవతో ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్యకు పరిష్కారం లభించింది. మా కాలనీలో డ్రైనేజీలన్నీ బాగుపడ్డాయి.

– సురేష్, వుడా లేఅవుట్ అసోసియేషన్ కార్యదర్శి

నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత



వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలతో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో పనులు చేపడుతున్నాం. గతంలో కంటే ఈ సారి డ్రైనేజీల నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. పనులు సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నాం.

– ఏడుకొండలు, డీఈఈ, జీవీఎంసీ 5వ జోన్

అన్ని వర్గాలకు మేలు చేసే ప్రభుత్వం



వార్డుల్లో నివసించే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా అభివృద్ధి పనులు చేస్తున్నారు. గతంలో అయితే రాజకీయ పార్టీల నాయకుల సిఫార్సులతోనే కాలనీల్లో పనులు జరిగేవి. కానీ ఇప్పుడు ప్రజల అవసరాలను గుర్తించి, కాలనీల్లో పనులు చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తోంది.

– బీఎస్.కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్

పేదల ఇంటి చెంతకే ప్రభుత్వ వైద్యం

- వైఎస్సార్‌టీయూసీ'పశ్చిమ'అధ్యక్షుడు పుర్రె సురేష్
- 59వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు



శిబిరంలో పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పుర్రె సురేష్, వైద్యులు



శిబిరంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యురాలు

మల్కాపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట శ్రీరామరక్ష అని ప్రజలతో కితాబు అందుకుంటోందని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌యాదవ్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మరింత చేరువ చేసిందన్నారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వాస్పత్రులను ఆధునికీకరించి, అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికే ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్యులను పంపించి, సేవలు అందించిందన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విజయవంతంగా నిర్వహిస్తుందని చెప్పారు. ఎక్కడికక్కడ శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యారోగ్య శాఖ సిబ్బంది ద్వారా ప్రజలకు బీపీ, షుగర్, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులతో పాటు గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు పరీక్షలు చేసి, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. కాలనీ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, వార్డు వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

హక్కు పత్రాల పంపిణీ చారిత్రక నిర్ణయం

- సొంతింటి స్థలంతో పేదలకు ఆర్థిక దన్ను
- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



హక్కు పత్రాలు అందజేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: నగర పాలక సంస్థ పరిధిలో 100 గజాలు పైబడిన అభ్యంతరం లేని ఆక్రమణల తాలూకా భూములు, సొంతింటి స్థలాలకు చట్టపరమైన హక్కుల కల్పించటం చారిత్రక నిర్ణయమని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవో నంబర్ 388/2017 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. 52వ వార్డు శాంతినగర్ సామాజిక భవనంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణతో కలిసి ఆయన లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పట్టాలు అందుకున్న వారికి నివాసంపై అదే విధంగా వారి సొంత భూమిపై సర్వ హక్కులు ఉంటాయన్నారు. ఇప్పటి వరకు ఆక్రమణదారులనే పేరుతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కానీ ఇక నుంచి మీరంతా యజమానులేనని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ తీసుకొని, చారిత్రక నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇందుకు లబ్ధిదారులందరి తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. పేదలను సంపన్నులుగా చేయాలనే సంకల్పంతో పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా ఆశీర్వచనాలు అందజేసి, అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జియ్యాని విజయ్, జియ్యాని మారుతి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



సింహాచలం డిపోలో భద్రతా వారోత్సవాల్లో భాగంగా మాట్లాడుతున్న శిరిషా దేవి

గోపాలపట్నం: రహదారి భద్రత అందరి బాధ్యతగా భావించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిరీషాదేవి అన్నారు. ఈ మేరకు గోపాలపట్నం సమీప సింహాచలం డిపోలో గురువారం నిర్వహించిన రహదారి భద్రత మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. బస్సు డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని వాహనాలను నడపాలన్నారు. ప్రధానంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమన్నారు. డ్రైవర్లు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.రాజశేఖర్, అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎల్.సారి తులసి, డిపో సూపరింటెండెంట్ కె.వి.జి.కొండలరావు, డిపో సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

మల్కాపురం : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు వర్ధంతి కార్యక్రమాలు పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా జరిగాయి. 61వ వార్డు వెంకన్నపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గణబాబు ఏడు వార్డుల టీడీపీ అధ్యక్షులు, కార్యదర్శులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లోని టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు కోరుబిల్లి రాము, డొప్ప సన్యాసిరావు, నాగిరెడ్ల నర్సింగరావు, దిలీప్, సింగ్ పాల్గొన్నారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులో ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు మళ్ల చిన్న అప్పారావు ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. అభిమాన సంఘం నాయకులంతా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భీశెట్టి రవీంద్ర మోహన్, హంస్సేన్ నాయుడు, భాషా, లక్ష్మీ రమణమ్మ పాల్గొన్నారు.

సింహగిరిపై 'స్వచ్ఛ తీర్థ'


సింహాచలం: సింహగిరిపై గురువారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయాల్లో ఈ నెల 14 నుంచి 21 వరకు స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సింహగిరిపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ రాజగోపురం వద్ద ఉన్న చెత్తను తొలగించారు.

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు



స్వర్ణపుష్పాలు



నిత్యకల్యాణంలో మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి, కల్యాణమండపంలో వేదికపై కొలువు దీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. నీరాజనం సమర్పించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి కమనీయంగా కల్యాణం జరిపించారు. అర్చకులు టి.పి. రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

పద్మనాభనగర్ రహదారికి మోక్షం



గోతులమయంగా ఉన్న పద్మనాభనగర్ ప్రధాన రహదారి(నాడు)



బీటీ రోడ్డుగా నిర్మించిన పద్మనాభనగర్ రహదారి(నేడు)

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్ ప్రధాన రహదారికి ఎట్టకేలకే మోక్షం కలిగింది. ఏళ్లుగా గోతులమయంగా ఉన్న ఈ రహదారి బాగుపడింది. సుమారు పదేళ్లుగా ఈ రహదారి బాగు పడకపోవడంతో స్థానికులు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. దీంతో ఆయన వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి రూ.11.85 లక్షల నిధులు మంజూరు చేశారు. అయితే స్థానికంగా కొందరు వ్యక్తులు అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అన్ని అడ్డంకులు ఎదుర్కొని రహదారి నిర్మాణం పూర్తి చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోతులమయంగా ఉన్న రోడ్డులో నిత్యం చిన్న పాటి ప్రమాదాలు చోటు చేసుకునేవని గుర్తు చేసుకుంటున్నారు. రోడ్డును అభివృద్ధి చేయడంతో ప్రమాదాల సమస్యల నుంచి బయటపడ్డామని చెబుతున్నారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు ప్రత్యేకంగా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

గొర్రె దొంగతనం కేసులో ముగ్గురిపై కేసు

ఉక్కునగరం: గొర్రెను దొంగతనం చేసిన కేసులో స్టీల్‌ప్లాంట్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. పరవాడ సమీప దేశపాత్రుని పాలేనికి చెందిన ఉరుకూటి పైడిరాజు కొన్ని గొర్రెలను మేపేందుకు గురువారం టౌన్‌షిప్‌లోని సెక్టార్–9కు తీసుకు వచ్చాడు. సాయంత్రం గొర్రెల మందలోని ఒక గొర్రె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెదికారు. అనుమానం వచ్చి అదే సెక్టార్‌లోని 315బీ క్వార్టర్‌లోకి వెళ్లి చూడగా అక్కడ గొర్రె పీక కోసి ఉంది. దీంతో పైడిరాజు తమ గొర్రెను స్టీల్‌ప్లాంట్ ఫోర్‌మన్ కొయ్యూరు గోపీకృష్ణ, డిప్యూటీ మేనేజర్ ఎం.రమేష్‌కుమార్, కాంట్రాక్ట్ కార్మికుడు జి.శంకర్ నాయక్ అపహరించి, చంపివేశారని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వి.శ్రీనివాసరావు క్వార్టర్‌కు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. గొర్రె కళేబరాన్ని పోస్టుమార్టంకు పంపనున్నామని సీఐ తెలిపారు.

1071వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



1071వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1071వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులతో పాటు ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాల పరిస్థితి నేటికీ దీనస్థితిలో ఉందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని అన్నారు.